క్లుప్తంగా

సామాజిక తనిఖీ



పాలకుర్తి/పాలకుర్తి టౌన్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై డీఆర్‌డీఓ మొగులప్ప గురువారం సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కూలీలందరికీ పనులు కల్పించేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. 2022 ఏప్రిల్ నుంచి గతేడాది మార్చి 31వ తేదీ వరకు జరిగిన పనులపై తనిఖీ చేశారు. మొత్తం 36 గ్రామ పంచాయతీల్లో రూ.5,12,27,047 కూలీలకు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఎంపీపీ నాగిరెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎం.డి మదార్, జిల్లా అంబుడ్స్‌మన్ డాక్టర్ రాజు, ఏపీఓ సంధ్య, డీవీసీ నాగేశ్వర్‌రావ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

బచ్చన్నపేట: మండల కేంద్రంలో రజకులు నిర్వహిస్తున్న మడేలయ్య ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన నిందితుడు రాజును యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండల పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. వలిగొండ మండలం అర్రూర్ గ్రామానికి చెందిన రాజు.. మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడి తప్పించుకు తిరుగుతున్నాడు. గాలింపులో భాగంగా బచ్చన్నపేటలో జరుగుతున్న జాతరలో కనిపించగా పట్టుకున్నారు. నిందితుడిని బచ్చన్నపేట పోలీస్ స్టేషన్‌కు తరలించి అక్కడి నుంచి వలిగొండకు తీసుకెళ్లనున్నట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

రఘునాథపల్లి: మండలంలోని భానాజీపేట గ్రామ శివారులో నుంచి అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు ఎస్సై చాగర్ల రఘుపతి గురువారం తెలిపారు. భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం చిగురుమామిడి గ్రామ శివారు కంచ తండాకు చెందిన దిరావత్ అరుణ్, దిరావత్ శేఖర్‌లు ట్రాలీలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోలుకొండలో పట్టపగలు దొంగతనం కలకలం

దేవరుప్పుల: మండలంలోని కోలుకొండలో పట్టపగలు ఇళ్లలో దొంగలు పడ్డారనే కలకలం గ్రామస్తులను ఉత్కంఠతను లేపింది. గురువారం కోలుకొండలో ఓ దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తి చొరబడి వెళ్లిన నేపథ్యంలో డబ్బులు పోయాయని ఆరా తీయగా సదరు వ్యక్తి ఆర్టీసీ బస్సు ఎక్కివెళ్తుండగా గ్రామస్తులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం స్థానిక పోలీసులకు అప్పగించగా ఆ వ్యక్తి యాదాద్రి భువనగిరి జిల్లా మొత్కూరుకు చెందిన పల్లపు ఉపేందర్‌గా గుర్తించారు. ఈ విషయమై సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు చేరుకొని గతంలో ఎర్రగడ్డలో చికిత్స పొందిన ధ్రువీకరణ పత్రాలను చూపించి మతిస్థిమితం లేక ఇలా తిరుగుతూ ఉంటాడని చెప్పడంతో నిర్ధారణ అయింది. దీంతో ఆ వ్యక్తితోపాటు దగ్గర ఉన్న పలు వస్తువులను కుటుంబ సభ్యులకు పూచీకత్తుపై అప్పగించారు. కాగా, గ్రామానికి చెందిన పలువురు వివాహ శుభ కార్యాలతోపాటు మేడారానికి వెళ్లిన వారు దొంగలు పడ్డారనే వదంతులతో తమతమ ఇళ్ల తాళాలు ఉన్నాయనే విషయంపై ఆరా తీశారు.

మేడారంలో కొడవటూర్ వాసి మృతి



కొమురయ్య(ఫైల్)

బచ్చన్నపేట: మండలంలోని కొడవటూరు గ్రామానికి చెందిన చింతల కొమురయ్య(60) గురువారం మేడారంలోని జంపన్న వాగు సమీపంలో గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమురయ్య కుటుంబ సభ్యులతో కలిసి మేడారం సమ్మక్క–సారలమ్మలను దర్శించుకునేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో వాగు సమీపంలో గుండెపోటుతో కుప్పకూలిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. దైవదర్శనం కోసం వెళ్లి అకస్మాత్తుగా తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో మృతుడి కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య కనకవ్వ, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. కొమురయ్య మృతిపై గ్రామ మాజీ సర్పంచ్ గంగం సతీష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు నీల శైలజరమేష్, గ్రామస్తులు సంతాపం తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు..

లింగాలఘణపురం: బండ్లగూడేనికి చెందిన రైతు పెంతల సోమయ్యకు చెందిన ఎద్దు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. సోమయ్య బావి వద్ద లేనప్పుడు ఎద్దు మేత మేసుకుంటూ వెళ్లి ఎస్ఎస్–37 నంబర్ 25 కే.వీ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందింది. రూ.70వేల విలువైన ఎద్దు మృతి చెందడంతో రైతు కన్నీరుమున్నీరయ్యాడు. ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని వేడుకుంటున్నాడు.

కొలువుదీరిన సమ్మక్క

● జాతరలకు పోటెత్తిన భక్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ, జిట్టిగూడెం గ్రామ పంచాయతీల పరిధిలోని సమ్మక్క–సారలమ్మ మినీ మేడారం జాతరలో, మండలంలోని ఇప్పగూడెం, రంగరాయగూడెం, కోమటిగూడెం, అక్కపెల్లిగూడెం గ్రామాల పరిధిలోని చింత గట్టు సమ్మక్క–సారలమ్మ జాతరలో గురువారం రాత్రి వనదేవత సమ్మక్క గద్దెపై కొలువుదీరింది. జాతర కమిటీ చైర్మన్, ప్రత్యేక అధికారులు, ప్రత్యేక పోలీసు బందోబస్తు నడుమ చేపడుతున్న జాతరలో కోయపూజారులు గుట్టపై నుంచి సమ్మక్కను ఆదివాసీల సంప్రదాయాలతో ప్రత్యేక పూజలతో గద్దెపైకి చేర్చారు. ఇప్పగూడెంలో జాతర కమిటీ మాజీ చైర్మన్ మందపురం ఎల్లగౌడ్, కమిటీ బాధ్యులు జాలుకుంట్ల శిరీష్‌రెడ్డి, మునిగెల రమేష్, నెలమంచ అజయ్‌రెడ్డి, కత్తుల కట్టయ్య, తోట వెంకన్న తదితరుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయగా, తాటికొండలో వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, చైర్మన్ మహేందర్ తదితరుల ఆధ్వర్యంలో సమ్మక్కతల్లిని గద్దెపైకి పోలీసుల బందోబస్తు మధ్య కోయపూజారులు సమ్మక్కను గద్దెపై ప్రతిష్ఠించారు. సమ్మక్క తల్లి గద్దెపైన కొలువుతీరిన అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాలకు చెందిన భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

తల్లులను దర్శించుకున్న ఎమ్మెల్యే కడియం

మండలంలోని తాటికొండ, రంగరాయగూడెం గ్రామాల పరిధిలోని సమ్మక్క–సారలమ్మ జాతరను, ఇప్పగూడెం, రంగరాయగూడెం, అక్కపెల్లిగూడెం, కోమటిగూడెం గ్రామాల పరిధిలోని చింత గట్టు సమ్మక్క–సారలమ్మ జాతరను స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా జాతరలలో తల్లులను దర్శించుకుని పూజలు చేశారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాపోలు మధుసూదన్‌రెడ్డి, గన్ను నర్సింహులు ఉన్నారు.

జాతరలను సందర్శించిన రాజయ్య, ఇందిర

మండలంలోని తాటికొండ, ఇప్పగూడెం జాతరలను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర గురువారం రాత్రి వేర్వేరుగా సందర్శించారు. ఈ సందర్భంగా సమ్మక్క–సారలమ్మలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట వైస్ ఎంపీపీ సుధీర్‌రెడ్డి, తాటికొండ జాతర చైర్మన్ కె.మహేందర్ గౌడ్, ఐత వీరేశం, మహిపాషా, మహేష్, సంతోష్, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

చిల్పూరు మండలంలో..

చిల్పూరు: మండలంలో జరుగుతున్న మినీ మేడారం జాతరల్లో బుధవారం సారలమ్మ, గురువారం సమ్మక్క గద్దెలకు చేరడంతో వనదేవతలను దర్శించుకునేందుకు జాతర ప్రాంగణాలు భక్తులతో నిండిపోయాయి. గురువారం సాయంత్రం మేడారానికి చెందిన కోయ పూజారులతో ఈఓ వంశీ, వైస్ చైర్మన్ వెంకన్న, డైరెక్టర్లు గాలి రాజు, రంగు సురేష్‌లతో పాటు కండ్లకోలు బాలరాజు, అపరాదపు రాజు శ్రీపతిపల్లి–కొండాపూర్‌లో చైర్మన్ కేశిరెడ్డి మనోజ్ రెడ్డి, వైస్ చైర్మన్ పుట్ట రాజు, చిల్పూరులో చైర్మన్ బోళ్ల రాజ్‌కుమార్‌లు సమ్మక్కను గద్దెకు చేర్చారు. కాగా, జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా రఘునాథపల్లి, పాలకుర్తి సీఐలు శ్రీనివాస్‌యాదవ్, మహేందర్‌రెడ్డి ఆదేశాలతో ఎస్సైలు వినయ్‌కుమార్, రఘుపతి, చెన్నకేశవులు బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎస్‌బీ అజీజ్‌పాషా, ఎంపీఓ మధుసూదన్, కార్యదర్శులు పూల శ్రీకాంత్, పన్నీరు మధుసూధన్, పిట్టల బాబు, తండ రాంబాబు తదితరులు సౌకర్యాలు కల్పించారు. ఫత్తేపూర్‌లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య, చిల్పూరులో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర వనదేవతలను దర్శించుకున్నారు. కాగా, లింగంపల్లి సమ్మక్క–సారలమ్మ జాతర వైస్ చైర్మన్ రావులపల్లి వెంకన్న, డైరెక్టర్లను ఈఓ చిందం వంశీ సన్మానించారు.



స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెంలో సమ్మక్కను గద్దెకు తీసుకొస్తున్న పూజారులు



స్టేషన్‌ఘన్‌పూర్: గద్దెల వద్ద భక్తుల సందడి



స్టేషన్‌ఘన్‌పూర్: జాతరలో పోటెత్తిన జనం



బచ్చన్నపేట: మన్‌సాన్‌పల్లిలో..



తాటికొండలో సమ్మక్క గద్దె వద్ద పూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి తదితరులు



స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండలో..



ఇప్పగూడెం జాతరలో మొక్కులు చెల్లిస్తున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తదితరులు

మన్‌సాన్‌పల్లిలో..

బచ్చన్నపేట: మండలంలోని మన్‌సాన్‌పల్లిలో నిర్వహిస్తున్న మినీ మేడారం జాతర సందర్భంగా గురువారం సమ్మక్క గద్దెకు చేరడంతో భక్తులు భారీ సంఖ్యలో చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు.



చిల్పూరు: లింగంపల్లిలో గద్దెల వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



లింగంపల్లిలో సమ్మక్కను తీసుకొస్తున్న పూజారులు



చిల్పూరులో..



చిల్పూరులో మొక్కులు చెల్లిస్తున్న ఇందిర





మేడారం ఎఫెక్ట్..

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత సేవలు అమలులోకి వచ్చిన తర్వాత మహిళా ప్రయాణికుల సంఖ్య పది రెట్లకు పైగా పెరిగింది. ఆర్టీసీ బస్టాండ్‌లు తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ప్రయాణికులతో రద్దీగా కనిపిస్తున్నాయి. మేడారం ప్రభావంతో గురువారం మాత్రం జనగామ ఆర్టీసీ బస్టాండ్ బోసిపోయి కనిపించింది. బస్సులు కూడా ఖాళీగా వెళ్లాయి. -జనగామ

ఘనంగా మడేలయ్య విగ్రహ ప్రతిష్ఠ



హోమంలో పాల్గొన్న రజక కుటుంబాలు

బచ్చన్నపేట: మండల కేంద్రంలో రజకుల ఆరాధ్యదైవమైన మడేలయ్య విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కొత్తగా నిర్మించిన ఆలయంలో గురువారం అర్చక బృందం ఉదయం 11 గంటలకు వృషభ లగ్న హోమం నిర్వహించింది. అదే విధంగా విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, కుంబాభిషేకం, దిష్టికుంభం కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం మహా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



వినతి పత్రం అందజేస్తున్న యూత్ సభ్యులు

నర్మెట: మండలంలోని వెల్దండలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ గణేష్ యూత్ అసోసియేషన్ సభ్యులు గురువారం ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరుకోగా మౌలిక వసతుల సమస్య నెలకొందని, నూతనంగా తరగతి గదులు నిర్మించినా మరుగుదొడ్లు లేవని, తాగు నీటి సౌకర్యం కల్పించాలని, పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని కోరారు. గ్రామంలోని అమ్మాపురం బైపాస్‌రోడ్డులో మురుగుకాల్వ అసంపూర్తిగా ఉందని, కొత్తగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనం ప్రారంభించడంతోపాటు పాత జీపీలో గ్రంథాలయాన్ని ఏర్పాటుచేయాలని అన్నారు. అసంపూర్తిగా ఉన్న సబ్‌సెంటర్‌ను పూర్తిచేసి ఏఎన్‌ఎంను నియమించాలని, గ్రామంలో వసతులు కరువై ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే స్పందించి సమస్యలను సత్వరం పరిష్కరించాలని సభ్యులు ఎమ్మెల్యేను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.

నవగ్రహాలకు ఎమ్మెల్యే పల్లా పూజలు

మండలంలోని అమ్మాపురం శివాలయం, హనుమాన్ దేవస్థాన ప్రాంగణంలో వంగ గోపాల్‌రెడ్డి కుమారులు రఘునందన్ రెడ్డి, రవిందర్ రెడ్డి గురువారం నవగ్రహ ప్రతిష్ఠాపన అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. కాగా, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరై పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయల పూజారులు తీర్థప్రసాదాలు అందించి శాలువాతో ఎమ్మెల్యేను సత్కరించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శివరాత్రి వేడుకల ఏర్పాట్ల పరిశీలన

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని వీరన్నగుట్ట వద్ద గురువారం కమిటీ అధ్యక్షుడు బంద్రు సత్తయ్య ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణ పరిసరాలు పరిశుభ్రం చేయడం, తాగునీటి వసతి కల్పించడం వంటి వాటిపై చర్చించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు బంద్రు సత్తయ్యపద్మ దంపతులు ఆలయ నిర్మాణానికి రూ.10వేల విరాళం అందించారు. గౌరవ అధ్యక్షుడు కేమిడి భిక్షపతి, ఉపాధ్యక్షుడు వీరయ్య, ప్రధాన కార్యదర్శులు చంద్రయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

దేవరుప్పుల: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సింగారపు రమేష్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంజాబ్ సరిహద్దులో రైతాంగ సమస్యలపై ఆందోళన చేస్తున్న యువరైతు శుభకర బీసింగ్‌ను కేంద్ర, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాలు అణిచివేత పేరిట అతిక్రూరంగా హత్యచేశాయని విమర్శించారు. పయ్యావుల భిక్షపతి పాల్గొన్నారు.

రైతులపై దాడులు నిలిపివేయాలి

జఫర్‌గఢ్: ఢిల్లీ సరిహద్దుల్లో రైతులపై చేస్తున్న దాడులను మోదీ ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు వడ్లకొండ సుధాకర్, కాట సుధాకర్, ఇక్బాల్, యాకయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

జనగామ రూరల్: దేశానికి వెన్నుముక అయిన అన్నదాతలను చంపే సంస్కృతి విడనాడాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో అన్నారు. ఢిల్లీలో మద్దతు ధర కల్పించాలని ఆందోళన చేస్తున్న వారిపై కేంద్ర ప్రభుత్వం కాల్పులకు పాల్పడడం దారుణమని అన్నారు. తక్షణం చర్చలు జరిపి మృతి చెందిన రైతుకు రూ.కోటి విరాళం అందించాలని డిమాండ్ చేశారు.

అన్నదాతలపై కాల్పులు దుర్మార్గం

బచ్చన్నపేట: పంటలకు మద్దతు ధర కల్పించాలని పంజాబ్, హర్యానా రాష్ట్రాల సరిహద్దులో రైతులు ఆందోళన చేస్తుంటే వారిపై కాల్పులు జరపడం దుర్మార్గమైన చర్య అని నియోజకవర్గ కిసాన్ కోఆర్డినేటర్ జంగిటి నరేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే అన్నదాతలు కష్టించి పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తే వారి పై కాల్పులు చేయించడం సరికాదని అన్నారు.

బెంచ్‌ల బహూకరణ



జనగామ రూరల్: పట్టణంలోని స్టేషన్ రోడ్డులోని ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు స్కూల్‌కు 16 డ్యూయల్ బెంచ్‌లను గురువారం బహూకరించారు. రోడ్ల విజయ, రోడ్ల రాధమ్మ, మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకటరమణల జ్ఞాపకార్థం అందజేసినట్లు రోడ్ల దామోదర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జయకుమార్, రాజసులోచన, మల్లికార్జున్, యాదగిరి, కృష్ణ, ప్రభాకర్, రవీందర్, నాగేశ్వర్ రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఒత్తిడిలేకుండా హాల్ టికెట్లు ఇవ్వాలి

జనగామ రూరల్: ఇంటర్ విద్యార్థులకు ఎలాంటి ఒత్తిడిలేకుండా హాల్ టికెట్లు ఇవ్వాలని ఏబీవీపీ జిల్లాకన్వీనర్ తోట హృతిక్ సాయి అన్నారు. గురువారం పట్టణంలోని ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట కళాశాలల యజమాన్యాలు ఫీజుల పేరుతో హాల్ టికెట్ ఇవ్వకుండా ఒత్తిడి చేయొద్దన్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో రాయడానికి సహకరించేలా ఇంటర్ విద్య అధికారి చూడాలని కోరారు.

ప్రజా పోరాటాలను విస్తృతం చేయాలి

జనగామ రూరల్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెండు రోజుల పాటు సీపీఎం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం జిల్లా రిపోర్ట్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి ప్రవేశ పెట్టాడు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రజాపోరాటాలు విస్తృతం చేస్తామని అన్నారు.

భోజన బిల్లులు విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న కార్మికులు


రఘునాథపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, టిఫిన్ చేస్తున్న నిర్వాహకుల నాలుగు నెలల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని భారత రాష్ట్ర సమితి కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వేముల నర్సింగం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భోజన బిల్లులు, వేతనాలు ఇవ్వాలని గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ముందు కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగం మాట్లాడుతూ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, టిఫిన్ చేసి వడ్డిస్తున్న మహిళా నిర్వాహకులకు నాలుగు నెలలుగా బిల్లులు, జీతాలు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. బిల్లులు రాక కార్మికులు అప్పుల్లో కూరుకు పోతున్నారని, వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. సంఘం మండల అధ్యక్షురాలు బిర్రు భూలక్ష్మి, ఉపాధ్యక్షులు సువర్ణ, సోమలక్ష్మి, నాగమణి, రేణుక, శిరీష, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

విధుల్లో నిర్లక్ష్యం వహించిన డాక్టర్‌కు మెమో

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో పల్మనాలజిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కె.మనోహర్ విధులకు సమయానికి హాజరు కాకపోవడంతో ఇటీవల కొంత మంది ఫిర్యాదు చేశారు. వైద్యం సరిగా అందించడం లేదని పూర్తి సమయం వెచ్చించడం లేదని తెలుపగా డీహెచ్‌ఎస్ సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు అకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్ లేక పోవడంతో సీసీఏ రూల్స్ ప్రకారం డాక్టర్ మనోహర్‌ను సస్పెండ్‌చేస్తూ మెమో జారీ చేశారు. ఈ సందర్భంగా సుగుణాకర్ రాజు మాట్లాడుతూ విధులో ఎవరు నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా ప్రభాకర్‌మాదిగ




రఘునాథపల్లి: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్యమాదిగ, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేదాటి మోహన్‌మాదిగల ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీరటి ప్రభాకర్‌మాదిగ సమక్షంలో గురువారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కందుకూరి మల్లేష్‌మాదగ, అధ్యక్షుడిగా కన్నారపు ప్రభాకర్‌మాదిగ, ప్రధాన కార్యదర్శి ముక్క అనందంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడ స్వామిమాదిగ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల నూతన కార్యవర్గం



దేవరుప్పుల: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (మేడి పాపన్న) విభాగం మండల అధ్యక్షుడిగా మహంకాళి విష్ణును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ విభాగం పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడ స్వామి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శిగా చింత ఉపేందర్, అధికార ప్రతినిధిగా నల్ల ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా బట్ట వేణు, సహాయ కార్యదర్శిగా గువ్వల ప్రదీప్, ప్రచార కార్యదర్శిగా మహంకాళీ ప్రవీణ్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మేడటి పాపన్న, వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేదాలి మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

చేయూత



రఘునాథపల్లి: మండలంలోని కోమల్లలో ఇటీవల అంబేడ్కర్ యువజన సంఘం సభ్యుడు బొల్లపల్లి వెంకటస్వామి(శివ) అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, గురువారం ఆ సంఘం నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి చేయూత అందించారు. అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు రూ.16,800 బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కొయ్యడ రాజు, చంద్రమౌళి, ఎల్లస్వామి ఉన్నారు.